

క్రీడల్లో గెలుపోటములు సహజం

కామారెడ్డి టౌన్, జూన్ 16: క్రీడల్లో గెలుపోటములు సహజమని మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియచంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మున్సిపల్ ఉద్యోగుల్లో ఒత్తిడిని దూరం చేసేవిధంగా జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో క్రికెట్ పోటీలు నిర్వహించామని తెలిపారు. మొదటి స్థానంలో నిలిచిన రెవెన్యూ టీం, రెండో స్థానంలో నిలిచిన ఇంజనీరింగ్ విభాగం టీంకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ ఉరుదోండ వనిత రవి, కౌన్సిలర్‌లు శివకృష్ణమూర్తి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తుల కోసం హత్యలు


సోంపూర్‌లో హత్యకు గురైన లాలప్ప


సాతెల్లిలో దుర్గయ్య

- అయిన వారిని, నమ్మిన వారిని హత మారుస్తున్నారు
- రోజుకో హత్య.. హత్యలతో పెరుగుతున్న నేర ప్రవృత్తి
- జిల్లాలో ఇటీవల భయపెడుతున్న ఆస్తి, భూ తగాదాలు
- వారం రోజుల్లో ఆస్తి కోసం ఇద్దరి హత్య
- కన్న తండ్రిని హతమార్చిన తనయుడు.. ఎకరం భూమి కోసం భర్తను హత్య చేసిన భార్య, కుమారుడు
- జిల్లాలో ఆగని భూ వివాదాలు
- చివరకు గొడవలకు, హత్యలకు దారి తీస్తున్న వైనం

కామారెడ్డి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): పట్టణీకరణ నేపథ్యంలో జిల్లాలో భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. మార్కెట్‌లో భూముల విలువలు గణనీయంగా పెరగడంతో రోజురోజుకూ భూ వివాదాలు తలెత్తుతున్నాయి. ఆస్తులు, భూ తగదాలతో దాడులు, ప్రతిదాడులు తరచూ చోటు చేసుకుంటున్నాయి. కొన్ని సందర్భాల్లో హత్యలకు దారి తీస్తున్నాయి. ప్రభుత్వం విడతల వారీగా భూ సమస్యల పరిష్కారం చేపడుతున్నా రికార్డుల్లో మాత్రం సరికావడం లేదు. పేద, అమాయక రైతులకు సంబంధించిన రికార్డుల్లో ఇతర పేర్లు ఉంటున్నాయి. తమ భూమి రికార్డుల్లో వేరే వారి పేర్లు రాశారంటూ చాలా చోట్ల రెవెన్యూశాఖకు, ఉన్నతస్థాయి అధికారులకు ఫిర్యాదులు వెలుతున్నాయి. అయినా సమస్య పరిష్కారం కావడం లేదు. మరోవైపు ఆస్తులు, భూముల కోసం కన్న వారిని, కట్టుకున్న వారిని హతమారుస్తున్నారు. జిల్లాలో ఇటీవల కాలంలో భూ వివాదాలు, ఆస్తుల కోసం హత్యలతో నేరప్రవృత్తి పెరుగుతోంది. వారం రోజుల వ్యవధిలోనే జిల్లాలో ఆస్తుల కోసం ఇద్దరిని హతమార్చిన ఘటనలు చోటు చేసుకోవడం ఆందోళనకరం.

హత్యలకు దారి తీస్తున్న ఆస్తి తగాదాలు, భూ వివాదాలు

జిల్లాలో భూ తగదాలు, ఆస్తుల గొడవలు హత్యలకు దారి తీస్తున్నాయి. ఏదో ఒకచోట ఇలాంటి సంఘటనలు ఆందోళనకు గురి చేస్తున్నాయి. గత వారం రోజుల కిందట జుక్కల్ మండలం సోంపూర్ గ్రామంలో ఆస్తి కోసం కన్నకొడుకే తండ్రిని హత్య చేశాడు. ఈ నెల 10వ తేదీన సోంపూర్ గ్రామానికి చెందిన లాలప్పకు ఇద్దరు కూమారులు ఉన్నారు. చిన్నకొడుకు సుభాష్ వ్యవసాయ భూమిని తన తండ్రి భార్య పేరిట రిజిస్ట్రేషన్ చేశారనే కారణంతో వ్యవసాయ పొలంలో లాలప్పను కుమారుడు సుభాష్ హత్య చేశాడు. ఈ ఘటన మరువక ముందే శనివారం ఎల్లారెడ్డి మండలం సాతెల్లి గ్రామంలో ఎకరం భూమి కోసం కట్టుకున్న భర్తను భార్య, కుమారుడు హతమార్చారు. సత్తెల్లి గ్రామానికి చెందిన కుర్మ దుర్గయ్యకు రెండెకరాల వ్యవసాయ భూమి ఉంది. ఎకరం తమకు ఇవ్వాలంటూ భార్య, కుమారుడు, కుటుంబ సభ్యులు దుర్గయ్యను కొట్టి చంపారు. గత ఏడు నెలల క్రితం ఆస్తి కోసం కుటుంబ సభ్యులను నమ్మిన స్నేహితుడు హతమార్చిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపిన విషయం తెలిసిందే. నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలానికి చెందిన ప్రసాద్‌తో పాటు కుటుంబానికి చెందిన ఐదుగురిని నమ్మిన స్నేహితుడు ప్రశాంత్ ఆస్తి కోసం హతమార్చాడు. ఇలాంటి ఘటనలు గతంలో రాజంపేట మండల కేంద్రంలో వ్యవసాయ భూమి విషయంలో భూమి అమ్మిన డబ్బులు ఇవ్వలేదని కన్న తండ్రినే కూతుర్లు, మనుమళ్లు, కట్టుకున్న భార్య హత్య చేశారు. ఆంజనేయులుకు రాజంపేట శివారులో వ్యవసాయ భూమి ఉండగా అందులో కొంత భూమిని అమ్మినప్పుడు వచ్చిన డబ్బులు తమకు ఇవ్వలేదని మిగతా భూమిని తన పేరు మీద చేయడం లేదంటూ కక్షగట్టి భార్య కూతుళ్లు ఆయన నివసిస్తున్న గుడిసెకు నిప్పంటించి హత్యచేశారు. మాచారెడ్డి మండల కేంద్రంలో ఇద్దరు అన్నదమ్ముల ఆస్తి విషయంలో తమ్ముడు అన్నపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి ఆసుపత్రి పాలయ్యాడు. మద్నూర్ మండలంలోని సోనాల్ గ్రామంలో ఆస్తి, భూ తగాదాల విషయంలో అన్నను తమ్ముడు హత్య చేశారు. బీబీపేట మండలంలో భూమి విషయంలో తమ్ముడిని అన్న హత్య చేసిన ఘటన చోటు చేసుకుంది. దోమకోండ మండలంలోని ముత్యంపేటలో భూమి విషయంలో ఒకరిని హత్య చేశారు. అదేవిధంగా కామారెడ్డి మండలం పరిధిలోని ఓ గ్రామంలోనూ వ్యవసాయ భూమిలో కూమారుడు కన్నతల్లినే హత్య చేశాడు. భిక్కనూర్ మండలంలో ఆస్తి తగదాల్లో అన్నదమ్ముల మధ్య ఘర్షణ చోటు చేసుకోగా ఇందులో ఒకరు మృతి చెందారు. ఇలా భూ, ఆస్తి తగదాల విషయంలో ఏదో ఒక చోట హత్యలు జరుగుతునే ఉన్నాయి. ఇలాంటి సంఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి.

భయపెడుతున్న భూ వివాదాలు

జిల్లాలో చాలా వరకు వ్యవసాయ భూములకు సంబంధించిన, ఆస్తులకు సంబంధించిన వివాదాలు కుటుంబ సభ్యుల మధ్యనే కనిపిస్తున్నాయి. భూములు, ఆస్తులు తగదాల్లో కన్న తండ్రి, తల్లి, కట్టుకున్న భర్త, భార్య, సోదరులను సైతం చూడకుండా దాడులకు పాల్పడడం హత్యలకు దారి తీస్తున్నాయి. కామారెడ్డి జిల్లా కేంద్రంతో పాటు బాన్సువాడ, ఎల్లారెడ్డి పట్టణాల్లో, ఆయా మండలాల్లో భూ తగాదాలతో కుటుంబీకుల మధ్యనే కాకుండా ఇరువర్గాల మధ్య ఘర్షణలు చోటు చేసుకోవడమే కాకుండా హత్యలకు దారితీసిన సంఘటనలు ఉన్నాయి. అన్నదమ్ములు, తండ్రీ కొడుకులకు సంబంధించిన భూమి, ఆస్తుల వివాదాలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. కబ్జాలో ఒకరు ఉంటే భూములు, ఆస్తులు మరొకరి పేరు మీద ఉండడంతో వివాదాలకు కారణమవుతోంది. అన్నదమ్ములు భూములు పంచుకున్నా రికార్డుల్లో సరిగా లేకపోవడంతో గొడవలు జరుగుతున్నాయి. భూ రికార్డుల ప్రక్షాళన సందర్భంలోనూ వాటికి సంబంధించిన చాలా వరకు పెండింగ్‌లో ఉండడంతో గొడవలు తగ్గడం లేదు. భూ రికార్డుల విషయంలో అన్నదమ్ముల మధ్య ఆందోళన కల్గిస్తున్నాయి. ఈ సంఘటనలు జిల్లాలో తరచూ చోటు చేసుకుంటున్నాయి.

కొలిక్కిరాని భూ వివాదాలు

ప్రభుత్వాలు భూ రికార్డుల ప్రక్షాళన ప్రారంభించి 10 సంవత్సరాలు గడుస్తున్నా భూ వివాదాలు మాత్రం తొలగడం లేదు. ధరణి లాంటి వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చినా భూ సమస్యలు పరిష్కారం కావడం లేదు. ఇప్పటికే రైతులు రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతునే ఉన్నారు. క్షేత్రస్థాయి రెవెన్యూ సిబ్బంది నిర్వాకం వల్ల సమస్యలు మరింత పెరిగాయని విమర్శలు వస్తున్నాయి. రికార్డుల ప్రక్షాళన మొదలు పెట్టిన నాటి నుంచి ఎలాంటి సమస్యలు లేని భూముల విషయాల్లో కొత్త వివాదాలు రాజుకుని పెండింగ్‌లో పడిపోయాయి. వీటితో పాటు రైతులకు వాస్తవంగా ఉన్న భూమి కంటే తక్కువగా నమోదు చేయడం తక్కువ భూమి ఉన్న ఖాతాలో ఎక్కువ భూమి ఎక్కించడం వంటి తప్పిదాలు దొర్లాయి. ఇలా భూ రికార్డు ప్రక్షాళన సమయంలో రెవెన్యూలోని కింది స్థాయి సిబ్బంది అక్రమాలకు పాల్పడ్డరన్న ఆరోపణలు ప్రభుత్వం దృష్టికి వెళ్లాయి. అందులో భాగంగానే గత ప్రభుత్వం కొత్త రెవెన్యూ చట్టాన్ని అమలులోకి తీసుకురావడం వీఆర్‌వో వ్యవస్థను రద్దు చేసిన విషయం తెలిసిందే. అయినప్పటికీ భూ వివాదాలు మాత్రం తొలగడం లేదు. ఇటీవల కొత్త ప్రభుత్వం ఏర్పడింది. ధరణి, భూ వివాదాల సమస్యలు పరిష్కరిస్తామని చెబుతోంది. ఇప్పుడైన ఈ ప్రభుత్వంలోనైన భూ సమస్యలు కొలిక్కి వస్తాయో లేదో చూడాలి.


కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న ఆశిష్ సంగ్వాన్

కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి టౌన్, జూన్ 16: కామారెడ్డి జిల్లా కలెక్టర్‌గా నూతనంగా నియామకమైన ఆశిష్ సంగ్వాన్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. అదనపు కలెక్టర్‌లు చంద్రమోహన్, శ్రీనివాస్‌రెడ్డిలు పూలు, మొక్కలు అందించి కలెక్టర్‌కు ఘన స్వాగతం పలికారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వం 20 మంది జిల్లా కలెక్టర్‌లను బదిలీ చేసిన విషయం విధితమే. గత అక్టోబరు నుంచి నిర్మల్ జిల్లా కలెక్టర్‌గా పని చేస్తున్న సంగ్వాన్ జిల్లాకు బదిలీపై వచ్చారు. అనంతరం జిల్లాలో అమలవుతున్న కార్యక్రమాలను ధరణి, ధాన్యం సేకరణ, డబుల్ బెడ్‌రూం ఇళ్ల ప్రగతిని అదనపు కలెక్టర్‌లను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చే ప్రజావాణి ఫిర్యాదుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి సత్వరమే పరిష్కరించాలన్నారు. ఆర్‌డీవో రంగనాథరావు, గిరిజన అభివృద్ధి అధికారి అంబాజీ, ఎస్‌సీ అభివృద్ధి అధికారి రంజిత, డీఈవో రాజు, డీపీఆర్‌వో శాంతికుమార్, తహసీల్దార్ జనార్ధన్, కలెక్టరేట్ ఏవో మసూర్ అహ్మద్, కలెక్టరేట్ పర్యవేక్షకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భగ్గుమంటున్న.. కూరగాయల ధరలు!

- పేద, మధ్య తరగతి కుటుంబాలపై ఆర్థిక భారం
- కూరగాయలు కొనేకంటే మాంసం వండుకున్నది నయమంటున్న ప్రజలు
- తగ్గిన సాగుతో ధరలు మరింత పెరిగే అవకాశం


కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారులు

కామారెడ్డి టౌన్, జూన్ 16: సామాన్యులు దినదినగండంగా బతుకుబండిని లాగించే పరిస్థితులు నెలకొంటున్నాయి. కూరగాయలు, నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతుండడంతో రోజువారి కూలీ సంపాదన హారతీ కర్పూరంలా కరిగిపోతోంది. నెలవారి బడ్జెట్ పెరిగిపోయి కడుపు మార్చుకునే పరిస్థితికి తీసుకువచ్చింది. జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల్లో కూరగాయల సాగు తగ్గిపోవడంతో ధర పెరుగుదలకు కారణమంటూ హోల్‌సేల్ వ్యాపారులు చెబుతున్నారు. గత నెలతో పోలిస్తే ఈనెల 80 శాతం పెరుగగా మరింత పైపైకి ఎగబాకే చాన్స్ ఉందని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి.

వర్షాభావ పరిస్థితులతో తగ్గిన పంటల సాగు

వర్షాభావ పరిస్థితులకు తోడు, ప్రకృతి వైపరిత్యాలతో జిల్లాలో కూరగాయల పంటలకు పెద్ద ఎత్తున నష్టం వాటిల్లడంతో 80 శాతం మేర దిగుబడి తగ్గిపోయింది. కిలో కూరగాయల ధరలు రూ.40 నుంచి రూ.70, రూ.120 వరకు పెరిగాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. జిల్లాలో రోజు వారికి సుమారు రూ.20లక్షలకు పైగానే కూరగాయల వ్యాపారం జరుగుతోంది. ధరలు పెరిగిపోవడం, కూరగాయలు సైతం కుళ్లిపోయే పరిస్థితి నెలకొనడంతో హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు కొనుగోలుకు గతం కంటే తగ్గించారు. ప్రస్తుతం కిలోకు సన్న మిర్చి రూ.80, వంకాయ రూ.40, క్యాబేజీ రూ.30, చిక్కుడుకాయ రూ.80, క్యారెట్ 50, టమాట రూ.60, కొత్తిమీర రూ.100, బీట్‌రూట్ రూ.60, క్యాప్సికం రూ.120, బీరకాయ రూ.70, పాలకూర రూ.40లతో పాటు ఇతరత్రా కూరగాయలు రూ.50కి పైగానే ధర పలుకుతున్నాయి.

సామాన్యుడి బడ్జెట్ తలకిందులు

కూరగాయల ధరలు రెండు నుంచి మూడింతలు పెరగడంతో సామాన్యుడి బడ్జెట్ తలకిందులు కాగా ఇలాగే ధరలు పెరిగితే కారం మెతుకులే దిక్కవుతాయనే వాదనలు వినిపిస్తున్నాయి. రోజు వారి కూలీలు నెలకు రూ.6 వేల నుంచి రూ.10 వేల వరకు సంపాదిస్తే ఇందులో ఒక కూరగాయల కోసమే రూ.5వేల వరకు ఖర్చుచేస్తున్నారు. ప్రభుత్వరంగ సంస్థల్లో అవుట్ సోర్సింగ్, ప్రైవేట్ కంపెనీలో తాత్కాలిక ఉద్యోగాలు చేస్తున్న కుటుంబాలు సైతం కూరగాయల ధరలు పెరగడంతో ఒక్క పూటకు ఖర్చుచేసే కూరలకు మూడు పూటలు సరిపెట్టుకునే పరిస్థితి తీసుకువచ్చిందని మరికొందరైతే కూరగాయల కంటే మాంసం తిన్నదే నయమని అటువైపు మొగ్గు చూపుతున్నారు.

త్యాగాలకు ప్రతీక బక్రీద్

- నేడు బక్రీద్ పండుగను జరుపుకుంటున్న ముస్లింలు
- ఉమ్మడి జిల్లాలో ప్రత్యేక ప్రార్థన కోసం ముస్తాబైన ఈద్గాలు

నాగిరెడ్డిపేట, జూన్ 16: త్యాగానికి ప్రతీకగా ముస్లింలందరూ ఈద్-ఉల్-అజ్హా (బక్రీద్) పండుగను సోమవారం భక్తి శ్రద్ధలతో జరుపుకోనున్నారు. ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం జిల్హిజ్జా మాసంలోని పదవ రోజున ముస్లింలు బక్రీద్ పండుగ వేడుకలను జరుపుకుంటారు. బక్రీద్ పర్వదినం రోజున నూతన వస్త్రాలు ధరించి గ్రామాల్లోని పొలిమేరల్లో ఉన్న ఈద్గాల వద్దకు వెళ్లి వందలాది మంది ముస్లింలు ఒకే చోట చేరి సామూహిక ఈద్ ప్రత్యేక నమాజ్ ప్రార్థనలు చేస్తారు. ఈద్గాలకు వెళ్లలేని వారు ఆయా మసీదుల వద్ద ఈద్ నమాజ్ ప్రార్థనలు చేస్తారు. బక్రీద్ పండుగ రోజున ముస్లింలు ఉదయాన్నే వేకువ జామున లేచి గుసుల్ స్నానం ఆచరిస్తారు. ప్రతీ ముస్లిం ఇంట్లో ఉదయం నుంచి పండుగ సందడి ప్రారంభమవుతోంది. నూతన వస్త్రాలు ధరించి సుగంధ ద్రవ్యాలు చల్లుకొని, కళ్లకు సుర్మా పెట్టుకుని, తలకు టోపి ధరించి ముస్లింలందరూ కలిసి సామూహిక ప్రార్థన కోసం ఈద్గాలకు వెళ్లి బక్రీద్ నమాజ్ చేస్తారు. మత గురువులు, ఇమాంలు ప్రత్యేక నమాజ్‌ను చదివిస్తారు. అనంతరం సర్వ మానవాళిపైన కరుణ, దయ చూపాలని, అందరినీ ఆనందంగా, సుఖ, సంతోషాలతో ఉంచాలని, ప్రతీ ఒక్కరి కష్టాలను తొలగించాలని, నరకం నుంచి విముక్తి కలిగించాలని, స్వర్గాన్ని ప్రసాదించాలని అల్లాహ్‌ను ప్రార్థిస్తారు. నమాజ్ ప్రార్థనల అనంతరం కుల మతాలకు అతీతంగా ఈద్ ముబారక్ అంటూ పండుగ శుభాకాంక్షలు చెబుతారు.

బక్రీద్ ప్రాముఖ్యత

త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగ ముస్లింలందరూ అల్లాహ్ ఆజ్ఞ ప్రకారం జంతువులను ఖుర్బాని ఇస్తారు. హజ్ యాత్ర కూడా ఇదే సమయంలో ప్రారంభమవుతోంది. దైవ ప్రవక్త హజ్రత్ ఇబ్రహీం అలైహిస్సలాంకు చాలా సంవత్సరాల వరకు సంతానం కలగదు. వయస్సు బాగా పెరిగిన తరువాత అల్లా దయ వల్ల అతనికి ఒక కుమారుడు జన్మిస్తాడు. అతనికి ఇస్మాయిల్ అని నామకరణం చేస్తారు. అల్లాహ్ హజ్రత్ ఇబ్రహీం భక్తిని పరిరక్షించడానికి తన ముద్దుల కుమారుడు ఇస్మాయిల్‌ను తన కోసం త్యాగం (కుర్బానీ) చేయాలని ఇబ్రహీంను అల్లాహ్ ఆదేశిస్తాడు. అల్లా ఆదేశాల ప్రకారం తన కుమారుడు ఇస్మాయిల్‌ను ఖుర్బానీ ఇచ్చేందుకు ఇబ్రహీం సిద్ధమై ఇస్మాయిల్‌ను ఖుర్బానీ (బలి) ఇస్తున్న సమయంలో అల్లాహ్ మహిమ వల్ల కుమారుడు ఇస్మాయిల్ పక్కకు నెట్టబడి, అతని స్థానంలో స్వర్గం నుంచి వచ్చిన ఓ గొర్రె పోతు ఖుర్బానీ కాబడుతుంది. అల్లాహ్ పెట్టిన పరీక్షలో ఇబ్రహీం నెగ్గుతారు. బక్రీద్ పండుగ సందర్భంగా మేకలు, గొర్రెలు, ఎద్దులను ఇతర జంతువులను ముస్లింలు ఖుర్బానీ ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. ఆర్థికంగా ఉన్న ప్రతీ ముస్లిం బక్రీద్ పండుగ రోజు జంతువులను ఖుర్బానీ ఇస్తారు. ఖుర్బానీ ఇచ్చిన జంతువు మాంసాన్ని మూడు భాగాలుగా చేసి ఒక భాగాన్ని నిరుపేదలకు, రెండో భాగాన్ని బంధువులకు పంచి మూడో భాగాన్ని కుటుంబ సభ్యుల కోసం వాడతారు. అందుకే బక్రీద్ పండుగను ఖుర్బానీ పండుగగా వ్యవహరిస్తారు.

ముస్తాబైన ఈద్గాలు

బక్రీద్ ప్రత్యేక నమాజ్ ప్రార్థనల కోసం ఉమ్మడి జిల్లాలోని ఈద్గాలన్నీ ముస్తాబయ్యాయి. ఈద్గాలల్లో ఒకేసారి వందలాది మంది ముస్లింలు బక్రీద్ ప్రత్యేక సామూహిక నమాజ్ ప్రార్థనలు చేయనుండటంతో ఈద్గాలను శుభ్రం చేసి సిద్ధం చేశారు. ఈద్గాల వద్ద నీడ కోసం టెంట్లు వేసి, తాగునీటి సౌకర్యం కల్పించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. ఈద్గాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. పండుగ సందర్భంగా ఈద్గాల వద్దకు వివిధ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు వెళ్లి ముస్లిం సోదరులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలుపనున్నారు.


నిజాంసాగర్ ప్రాజెక్టు

సాగుకు సిద్ధమవుతున్న రైతులు

నిజాంసాగర్, జూన్ 16 : ఉమ్మడి జిల్లా వర ప్రదాయిని నిజాంసాగర్ ప్రాజెక్టు కింద వర్షాకాలం సాగుకు రైతాంగం సిద్ధమవుతున్నారు. వర్షాకాలం ప్రారంభమై వారం రోజులు గడుస్తుండటంతో రైతాంగం సాగు భూముల్లో దుక్కులు దున్ని సిద్ధం చేస్తున్నారు. వరి నారు మళ్లువేసేందుకు ఇప్పటికే రైతులు అధిక దిగుబడి సాధించే విత్తనాలను ఎంచుకున్నారు. వర్షాకాలం ప్రారంభమై వారం రోజులు గడుస్తుండటంతో మరో రెండు, మూడు రోజుల్లో వరి నారుమళ్లకు విత్తనాలు విత్తనున్నారు. గత ఏడాది వర్షాకాలం, యాసంగిలో నిజాంసాగర్ ప్రాజెక్టు కింద దాదాపు లక్షా 60 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. వర్షాకాలంలో లక్షా 60 వేలు, యాసంగిలో లక్షా 35 వేల ఎకరాల్లో వరి నాట్లు వేసి అధిక దిగుబడి సాధించారు. వర్షాకాలం సాగుకు నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి అంతంత మాత్రమే సాగునీరు విడుదల చేశారు. 11 టీఎంసీల నీరు ఆయకట్టు కింద వదలగా, లక్షా 35 వేల ఎకరాల్లో సిరులు పండించుకున్నారు. ప్రాజెక్టులో 1405 అడుగులకు గాను 1390.72 అడుగుల నీటి సామర్థ్యం కలిగి ఉంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 4.347 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వర్షాకాలం నాట్లకు సరిపడా నీళ్లున్నాయి. వర్షాకాలంలో అడపా దడప కురిసిన వర్షాలకు ఎగువ ప్రాంతం నుంచి నీరు వచ్చి చేరితే క్రమేపీ నిజాంసాగర్‌లో నీటి నిల్వలు పెరుగుతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది నిజాంసాగర్‌లో లక్ష్యాన్ని మించి వరినాట్లు వేసేందుకు రైతులు సమాయత్తం అవుతున్నారు. ఇప్పటికే రైతాంగం వరి విత్తనాలతో పాటు రసాయనిక ఎరువులను సమకూర్చుకున్నారు. ప్రతీయేటా రైతులు ట్రాక్టర్ల సహాయంతో దుక్కి దున్ని వరి నాట్లు వేస్తున్నారు. ఈ ఏడాది ఎకరాకు ఒక్కింటికి 4 నుంచి 5 వేల వరకు ట్రాక్టర్లకు చెల్లించనున్నారు. ఎకరాకు 5 వేల వరకు వరి నాట్లు వేసేందుకు కూలీలతో బేరసారాలు జరుపుకుని సిద్ధంగా ఉన్నారు. నిజాంసాగర్ ఆయకట్టు కింద దాదాపు లక్షా 65 వేల ఎకరాల్లో వరిని పండించేందుకు రైతులు తల మునకలవుతున్నారు. వర్షాకాల పరిస్థితులు సకాలంలో అనుకూలిస్తే సాగుకు ఢోకా లేదు. ఈ ఏడాది మరింత దిగుబడి సాధించాలనే ఆలోచనలో రైతులున్నారు. ఇదిలా ఉండగా, రుణమాఫీపైన ఆశలు సన్నగిల్లుతున్నాయి. రూ.రెండు లక్షల వ్యవసాయ రుణాలు మాఫీ చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. రుణమాఫీ అయితే రైతులకు మరింత ఊరట కానుంది. ఇప్పటికే రైతులు బ్యాంకులను సందర్శించి వ్యవసాయ రుణాల కోసం అర్జీలు పెట్టుకున్న రైతుల సంఖ్య కోకొల్లాలుగా ఉన్నాయి. ఏది ఏమైనా ఉమ్మడి జిల్లాల రైతులు నిజాంసాగర్ పైనే ఆశలు పెట్టుకోవడం గమనార్హం.

రత్నాపూర్ మల్లన్నకు ప్రత్యేక పూజలు



రత్నాపూర్ మల్లన్నస్వామి ఆలయ ముఖద్వారం

● ఐదేళ్లకు తేలిన ఆలయం

ముప్కాల్, జూన్ 16: ఉత్తర తెలంగాణ జిల్లాల వరప్రదాయిని శ్రీరాంసాగర్‌ప్రాజెక్టు నిర్మాణంలో నీట మునిగిన గ్రామ రత్నాపూర్ మల్లన్నకు ఆది వారం భక్తులు పోటె త్తారు. ఐదేళ్ల తర్వాత ప్రాజెక్టు నీటిమట్టం తగ్గుముఖం పట్టడంతో మల్లన్న గుడిఆలయం తేలింది. దీంతో ప్రతీ ఆదివారం మల్లన్నకు నైవేద్యాలు సమర్పిస్తూ వనబోజనాలు చేస్తున్నారు. ఆలయంలో భక్తులు నైవేద్యాలు సమర్పించి వనభో జనాలు చేస్తున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు వసతులు కల్పించాలని దాతలను కోరుతున్నారు. అప్పట్లో 91గ్రామాలు ప్రాజెక్టు నిర్మాణంలో ముంపునకు గురై ఇతర ప్రాంతాల్లో ప్రభ ుత్వం వారికి పునరావాసం కల్పించింది. ప్రాజెక్టులో నీరు డెడ్ స్టోరేజీకు చేరడంతో రోడ్డు గుండా వాహనాల ద్వారా తరలివెళ్తున్నాయి. అంతకు ముందు నీటిలో కాలినకడన వెళ్లి మల్లన్నకు పూజలు చేశారు. ముంపు గ్రామాల ప్రజల వచ్చి మల్లన్నకు ప్రాజెక్టు నీటిలో స్నానాలు చేసి బోనాలతో నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గుట్ట ఆధునీకరణ కోసం భక్తులు ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం నీరు తగ్గి గుట్టకు భక్తులతాకిడి పెరిగుతున్నట్టు అభివృద్ధికి ముందుకు వస్తున్నారు. పాత రత్నాపూర్‌కు చెందిన భూమన్న బావి ఆధునీకరణ కోసం ముందుకు వచ్చారు. భక్తుల సాయంతో గుట్టపై సీసీ, ఆలయ అభివృద్ధి చేస్తామని ఆయన పేర్కొన్నారు.



ఆలయంలో నైవేద్యాలు సమర్పిస్తున్న భక్తులు

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

- విదేశాలకు భారీ వాహనాల ఎగుమతి
- అదుపులోకి తీసుకున్న వరంగల్ పోలీసులు
- 70 లక్షల విలువైన ఐదు కార్లు స్వాధీనం

మట్టెవాడ, జూన్ 16: ఫైనాన్షియర్ల ముసుగులో కార్లు, టిప్పర్లు, జేసీబీ వంటి భారీ వాహనాలను మోసపూరితంగా కొనుగోలు చేసి నెదర్లాండ్, దక్షిణాఫ్రికా, కాంబోడియా వంటి దేశాలకు విక్రయిస్తున్న ముఠాను అరెస్టు చేసినట్లు వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ అబ్దుల్ బారి తెలిపారు. ఆదివారం వరంగల్ మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తురకలకుంట గ్రామానికి చెందిన వరికుప్పల దశరథ్, పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం వసంతనగర్ చిన్నదుర్గం నందాన్, రంగారెడ్డి జిల్లా మేడ్చల్ మండలం జగద్గిరిగుట్టకు చెందిన కొశెట్టి రాకేశ్, హైదరాబాద్ సంతోష్‌నగర్ ఓల్డ్ సిటీకి చెందిన మహ్మద్ జాబీర్‌లు ఈ దందాకు తెరలేపారన్నారు. వీరు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో... ఆర్థిక ఇబ్బందుల కారణంగా భారీ వాహనాలు అమ్మకానికి పెట్టుకున్న కొంతమంది యజమానుల నుంచి వాహనాలు కొనుగోలు చేసేవారని చెప్పారు. వాటికి సంబంధించిన ఈఎంఐలు తామే కడతామని నమ్మించేవారన్నారు. అలా కొన్ని వాహనాలను ఇతరులకు విక్రయించడమో లేక స్క్రాప్ కింద అమ్మడమో చేసేవారని వివరించారు. అలాగే ముంబాయిలోని కొన్ని బృందాల ద్వారా విదేశాలకు ఎగుమతి చేసేవారని డీసీపీ వెల్లడించారు. ముఠా సభ్యులు గతంలో హైదరాబాద్ పోలీసులకు పట్టుబడి సుమారు 16 నెలలు జైలుకు వెళ్లారని, విడుదలయ్యాక కూడా అదే తరహాలో నేరాలకు పాల్పడుతున్నారని స్పష్టం చేశారు. 2023లో వరంగల్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో సుమారు నాలుగున్నర కోట్ల విలువైన వాహనాలను మోసపూరితంగా తీసుకొని నెదర్లాండ్, సౌతాఆఫ్రికా, కాంబోడియా లాంటి దేశాలకు ఎగుమతి చేశారని తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున వరంగల్ హనుమాన్‌జంక్షన్ వద్ద నిందితులను అదుపులోకి తీసుకొని, 5 కార్లను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

'నాలా' ఎలా?



(మొదటి పేజీ తరువాయి)

చెల్లించాలి. ధరణి రాక ముందు ఆర్డీవో స్థాయిలో వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్పు చేస్తూ నాలా చార్జీలు వసూలు చేసే వారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో భూముల విలువ ఆధారంగా 5శాతం, జీహెచ్ఎంసీ పరిధిలో 9శాతం చొప్పున తీసుకునేవారు. కానీ, తెలంగాణ ఏర్పాటు తర్వాత ధరణిని తీసుకొచ్చిన అప్పటి ప్రభుత్వం.. నాలా చార్జీలు చెల్లించేందుకు తొలుత ఆప్షన్ ఇవ్వలేదు. ఆ తర్వాత ఇచ్చినా.. ధరణిలో నమోదై ఉండి, ఎకరాలు, గుంటల చొప్పున నమోదై ఉన్న భూములకు మాత్రమే అవకాశం కల్పించింది. అనధికార లేఅవుట్లలో గజాల చొప్పున ఓపెన్ ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి అలాంటి ఆప్షన్ లేకుండా పోయింది. ఉదాహరణకు ఒక ఊరి శివారులో వ్యవసాయ భూమి ఉంటే.. ధరణిలో అది ఫలానా సర్వే నంబర్‌లో ఉందని పేర్కొంటూ దాని విస్తీర్ణం ఎకరాలు, గుంటల్లో ఉంటుంది. ప్రస్తుతం ఇలాంటి భూమిని మాత్రమే వ్యవసాయేతర భూమిగా కన్వర్షన్ చేసుకునే వీలుంది. గతంలోనే లేఅవుట్‌గా మార్చి, సదరు భూమిని గజాల చొప్పున వేర్వేరు వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేసి ఉంటే.. ధరణిలో అది హౌసింగ్ సైట్ అనే పేరుతో చూపిస్తోంది. ఇలాంటి భూమికి నాలా చార్జీలు చెల్లించే అవకాశం లేకుండా పోయింది. దీంతో దశాబ్దాల క్రితం భూములు కొనుగోలు చేసిన వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఆప్షన్ లేక సతమతం..

గ్రేటర్ హైదరాబాద్‌తోపాటు శివారు ప్రాంతాల్లో దశాబ్దాల క్రితమే పెద్దఎత్తున అనధికార లేఅవుట్లు వెలిశాయి. వాటిలో ఓపెన్ ప్లాట్లను వేలాది మంది కొనుగోలు చేశారు. ఆయా స్థలాల్లో భవన నిర్మాణ అనుమతులకు వెళ్లిన సందర్భంలో భూమి విలువలో ఎల్ఆర్ఎస్ చార్జీల కింద 30శాతం, నాలా చార్జీల కింద మరికొంత వసూలు చేసే వారు. దీనికితోడు జీహెచ్ఎంసీ పరిధిలోనైతే చేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్(సీఎల్‌యూ) పేరిట చార్జీలు తీసుకునేవారు. అయితే, తెలంగాణ ఏర్పాటు తర్వాత హెచ్ఎండీఏలో భవన నిర్మాణ అనుమతుల కోసం వెళ్లినప్పుడు కేవలం ఎల్ఆర్ఎస్ చార్జీలు మాత్రమే తీసుకుంటున్నారు. సదరు స్థలానికి నాలా చార్జీలు చెల్లించకపోతే.. ఆ ఫీజు చెల్లించి పత్రాన్ని తీసుకురావాలని సూచిస్తున్నారు. ధరణి వచ్చిన తర్వాత గుంటలు, ఎకరాల్లో ఉన్న భూముల కన్వర్షన్‌కు మాత్రమే ఆప్షన్ ఇచ్చిన ప్రభుత్వం... గజాల్లో ఉన్న స్థలాలకు సంబంధించిన ఆప్షన్ ఇవ్వకపోవడంతో చిన్న, మధ్య తరహా డెవలపర్లు, బిల్డర్లు తీవ్రంగా సతమతమవుతున్నారు. ఈ విషయమై గత ప్రభుత్వాన్ని రియల్ ఎస్టేట్ అసోసియేషన్ల ప్రతినిధులు అనేక మార్లు సంప్రదించినా.. ఫలితం దక్కలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా స్పందించి.. గజాల్లో ఉన్న స్థలాలకూ నాలా చార్జీలు తీసుకొని, భవన నిర్మాణ అనుమతులు ఇప్పించాలని వారు కోరుతున్నారు. దీన్ని అమలు చేస్తే ప్రభుత్వానికి రూ.వెయ్యి కోట్లకుపైగా ఆదాయం వస్తుందని పేర్కొంటున్నారు.

సమస్యను పరిష్కరించాలి

హైదరాబాద్ శివారు ప్రాంతాల్లోని అనధికార లేఅవుట్లలో భవన నిర్మాణాలు చేపట్టేందుకు పదేళ్లుగా పలువురు డెవలపర్లు, బిల్డర్లు ప్రయత్నం చేస్తున్నారు. కానీ అనుమతులు రాకపోవడంతో ఆయా స్థలాలన్నీ నిరుపయోగంగా మారుతున్నాయి. గత ప్రభుత్వంలో ధరణి తీసుకొచ్చి అదనపు చార్జీలను విధించి ఆదాయాన్ని పొందేందుకు రకరకాల మార్గాలను అప్పటి అధికారులు అన్వేషించారు. కానీ, ఆదాయం వచ్చే మార్గాలను గాలికి వదిలేసి.. ఉన్న చార్జీలను పెంచే ప్రయత్నం చేశారు. కొత్త ప్రభుత్వమైనా స్పందించి రియల్ ఎస్టేట్ రంగానికి గుదిబండగా మారిన నాలా సమస్యను పరిష్కరించాలి.

- ఎం.ప్రేమ్‌కుమార్, వెస్ట్‌జోన్ బిల్డర్స్ అసోసియేషన్ చైర్మన్

ఏఎఫ్‌సీఎస్‌పై నిరాధార ఆరోపణలు: టీజీఎస్ఆర్టీసీ

హైదరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఆటోమేటిక్ ఫేర్ కలెక్షన్ సిస్టం(ఏఎఫ్‌సీఎస్)పై నిరాధార ఆరోపణలు తగదని టీజీఎస్ఆర్టీసీ అధికారులు విజ్ఞప్తి చేశారు. ఉన్నతస్థాయి కమిటీ సిఫారసు మేరకే ఏఎఫ్‌సీఎస్‌ను అమలు చేస్తున్నట్లు ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. డిజిటల్ టికెటింగ్ కోసం సాంకేతికను అందిపుచ్చుకునేందుకు కేంద్రం రూ.20.97 కోట్లను విడుదల చేసిందని పేర్కొన్నారు. ఏఎఫ్‌సీఎస్ కోసం 2022 నవంబరు 2న టెండర్ నోటిఫికేషన్ విడుదల చేయగా.. ఇంటెలిజెంట్ టికెట్ యంత్రాల సరఫరా, డిజిటల్ టికెటింగ్, సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, నిర్వహణకు కావాల్సిన సర్వర్లు, మ్యాన్‌పవర్‌పై 'ఛలో మొబిలిటీ'కి బాధ్యతలను అప్పగించాలని కమిటీ ప్రతిపాదించినట్లు వివరించారు. బస్సుల్లో యూపీఐ, డెబిట్/క్రెడిట్ కార్డులతో డిజిటల్ పేమెంట్స్, స్మార్ట్‌కార్డ్స్, మొబైల్ టికెట్స్, మొబైల్ బస్‌పాస్ సౌకర్యం కల్పించేందుకు ఈ వ్యవస్థ దోహదపడుతుందన్నారు. మహాలక్ష్మి పథకం అమలుకు మహిళలకు స్మార్ట్‌కార్డ్ జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఇందుకు ఛలో మొబిలిటీ అనుభవం ఉపయోగపడుతుందని గుర్తించామన్నారు. దాంతో మార్చి 15న ఛలో మొబిలిటీకి లెటర్ ఆఫ్ ఇంటెంట్(ఎల్ఓఐ) ఇచ్చామని తెలిపారు. కొన్ని డిపోల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తామని, అన్ని డిపోల్లో అమలుకు మూడు నెలల సమయం పడుతుందని వివరించారు. అసోం, బిహార్ రాష్ట్రాలతోపాటు.. ముంబై, ఇండోర్, జబల్‌పూర్ నగరాల్లో ఈ వ్యవస్థ కొనసాగుతోందని, ఒక్క ముంబైలోనే ఛలో మొబిలిటీ ద్వారా 11 లక్షల స్మార్ట్‌లు జారీ అయ్యాయని పేర్కొన్నారు.

సైబర్ బాధితులకు రూ.31.29 కోట్లు రికవరీ

- టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్

హైదరాబాద్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల చేతిలో ఆర్థికంగా మోసపోయిన బాధితులకు రూ.31.29 కోట్ల సొమ్మును రికవరీ చేసినట్లు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో(టీజీసీఎస్‌బీ) డైరెక్టర్ శిఖాగోయల్ తెలిపారు. ఈ మేరకు తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (టీఎస్ఎల్ఎస్ఏ), టీజీసీఎస్‌బీ సంయుక్తంగా తీసుకున్న చర్యల వల్లే ఇది సాధ్యమైందని తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి 20వ తేదీ నుంచి జూన్ 8 వ తేదీ వరకు రెండు లోక్‌అదాలత్‌లతో కలిపి రూ.31.29 కోట్లు రికవరీ చేసినట్లు ఆయన వివరించారు. సైబర్ మోసాలకు సంబంధించి నాలుగునెలల్లోనే కోర్టులో 5,142 పిటిషన్లు నమోదు అయ్యాయని తెలిపారు. సైబర్ నేరాలపై టీజీసీఎస్‌బీ తక్షణమే స్పందిస్తూ బాధితుల సొమ్మును సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కకుండా చర్యలు తీసుకుంటున్నదని శిఖాగోయల్ చెప్పారు. సైబర్‌నేరగాళ్లు కొల్లగొట్టిన సొమ్మును బ్యాంకు ఖాతాల్లో ఫ్రీజ్ చేస్తున్నప్పటికీ బాధితులకు తిరిగి అందించడంలో ఆసల్యం అవుతోందని ఆయన అన్నారు. ఇలాంటి కేసులను సీఆర్‌పీసీ సెక్షన్ 457 కింద నమోదు చేయడంతో పాటు దర్యాప్తునకు సంబంధించి స్టాండర్డ్ ప్రొసీజర్ (ఎస్ఓపీ)లను తయారు చేసి అన్ని జిల్లాల ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీలకు పంపినట్లు శిఖాగోయల్ తెలిపారు.

యువకుడి ఉసురుతీసిన.. ఆన్‌లైన్ బెట్టింగ్

- 3 రోజుల క్రితం ఆత్మహత్యాయత్నం.. ఆస్పత్రిలో ఆదివారం మృతి



భాను(ఫైల్)

రామాయంపేట, జూన్ 16: ఆన్‌లైన్ బెట్టింగ్ ఓ యువకుడి ప్రాణాలు తీసింది. ఈ ఘటన మెదక్ జిల్లా రామాయంపేట మండలం ధర్మారం గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన దొమ్మాట భాను(24) డిగ్రీ పూర్తి చేసి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొన్ని రోజులుగా ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటుపడి రూ.2 లక్షల దాకా నష్టపోయాడు. దీంతో మనస్తాపం చెంది మూడు రోజుల క్రితం తన వ్యవసాయ పొలం వద్ద పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబీకులు వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రంజిత్ తెలిపారు.

164 కిలోల గంజాయి, 1.65 కిలోల గంజాయి చాక్లెట్లు సీజ్

- వేర్వేరు కేసుల్లో ఏడుగురి అరెస్టు



విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న టాస్క్‌ఫోర్స్ డీసీపీ రష్మిక పెరుమాళ్, ఏసీపీ శ్రీనివాసరావు

హైదరాబాద్ సిటీ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఒడిసా నుంచి హైదరాబాద్‌కు గుట్టుగా గంజాయి తరలిస్తున్న రెండు అంతర్రాష్ట్ర ముఠాలకు చెందిన ఆరుగురిని హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 164 కిలోల గంజాయి, మూడు కార్లు, ఓ బైక్, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ రష్మి పెరుమాళ్ సీసీఎస్‌లో ఆదివారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. హుమాయున్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ మొత్తంలో గంజాయి దిగుమతి అవుతుందనే సమాచారంతో దాడి చేసిన పోలీసులు ఓ ముఠాను పట్టుకుని వారి వద్ద వంద కిలోల గంజాయిని సీజ్ చేశారు. కామారెడ్డి జిల్లా పిట్లాంకు చెందిన ధారావత్ రవి, మహారాష్ట్ర నాందేడ్‌కు చెందిన సయ్యద్ బహదూర్, ఆనంద్ రామ్‌జీ కదమ్‌ను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ప్రధాన నిందితుడు ధారావత్ రవి ఇటీవల ఒడిశా వెళ్లి అక్కడ ఓ రైతు దగ్గర 100 కిలోల గంజాయి కొనుగోలు చేశాడు. దానిని 32 ప్యాకెట్లుగా మార్చి బహదూర్, ఆనంద్ రామ్‌జీ సహకారంతో కారులో హైదరాబాద్‌కి తరలించి పోలీసులకు పట్టుబడాడు. మరో కేసులో ఇదే తరహాలో ఒడిసా నుంచి నగరానికి గంజాయి తీసుకొచ్చిన హైదరాబాద్‌కు చెందిన షేక్ సర్వేజ్, అబ్దుల్ రవూఫ్, మహ్మద్ అన్వర్ అరెస్టయ్యారు. వారి నుంచి 64 కిలోల గంజాయిని చేసుకున్నారు. ఆసిఫ్‌నగర్‌కు చెందిన షేక్ పర్వేజ్ గతంలో రాజమండ్రి జైలులో శిక్ష అనుభవించాడు. ఇటీవల బయటికొచ్చిన పర్వేజ్ ఒడిసా వెళ్లి జైలులో అతనికి పరిచయమైన గంజాయి రైతు దీపక్‌ను కలిశాడు. దీపక్ నుంచి 64 కిలోల గంజాయి తీసుకుని రవూఫ్, అన్వర్‌తో కలిసి హైదరాబాద్‌కు తీసుకొచ్చి పోలీసులకు చిక్కాడు. మరో కేసులో యూపీ నుంచి హైదరాబాద్‌కు గంజాయి చాక్లెట్లు తీసుకొచ్చి విక్రయిస్తున్న వ్యక్తిని శేరిలింగంపల్లి పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద 1.65 కిలోల గంజాయి చాక్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. శంషాబాద్ పరిధిలో పార్టీలు, ఈవెంట్లలో తనిఖీలు చేసిన ఎక్సైజ్ పోలీసులు 8 మత్తు పదార్థాల ప్యాకెట్లను సీజ్ చేశారు.

ఏర్గట్లలో యథేచ్ఛగా ఇసుక అక్రమ దందా



తొర్తిలో అక్రమంగా డంప్ చేసిన ఇసుక (ఫైల్)

ఏర్గట్ల, జూన్ 16: మండలంలోని పలు గ్రామాల్లో ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. మండలంలో ఏ గ్రామంలో కూడా ఇసుక తీసుకోవడానికి అనుమతులు లేవు. ఇదే అదునుగా భావించిన ఇసుకాసురులు అధికారుల కళ్ళు కప్పి అక్రమంగా ఇసుక తరలిస్తూ లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు. అర్థరాత్రిల్లో ట్రాక్టర్‌లతో పాటు లారీల్లో ఇసుకను పలు చోట్లకు తరళించి డంప్ చేసుకొని దూర ప్రాంతాలకు తరళిస్తున్నారు. అయితే గుమ్మిర్యాల్ గ్రామంలో ఇటీవలే అర్ధరాత్రి సమయంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో స్థానిక తహసీల్దార్ మహమ్మద్ యూసుఫ్ వెంటనే గ్రామానికి వెళ్ళి అక్రమంగా తరళిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకొని సీజ్ చేయగా గత రెండు రోజుల క్రితం తొర్తి గ్రామంలో 15 ట్రాక్టర్‌ల ఇసుకను సీజ్ రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. ఏదేమైన అటు రెవెన్యూ ఇటు పోలీసు అధికారు లను లెక్క చేయకుండా ఇసుకాసురులు అక్రమ ఇసుక దందా పాల్పడటం, జిల్లాకు మారు మూల మండలం కావడంతో, జిల్లా స్థాయి అధికారులు పర్యవేక్షణ అంతంతమాత్రంగానే ఉండటం వల్లనే ఇలాంటి అక్రమా దందాలకు పాల్పడుతున్నట్లు వినికిడి.

అనుమతులు లేవు..

మహమ్మద్ యూసుఫ్ తహసీల్దార్, ఏర్గట్ల

మండలంలో ఇసుక తీసుకోవడానికి ఎలాంటి అనుమతులు లేవు. అక్రమంగా గ్రామాల్లో ఇసుక తరళించినట్లు సమాచారం అందిస్తే ఇసుకను సీజ్ చేయడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.



గుమ్మిర్యాల్‌లో ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్న తహసీల్దార్ (ఫైల్)

అధ్వానంగా తెలంగాణ యూనివర్సిటీ శిలాఫలకం



పెచ్చులూడిన టీయూ శిలాఫలకం

డిచ్‌పల్లి,జూన్ 16: పదేళ్ల క్రితం జాతీయ రహదారి పక్కన ప్రారంభించిన శిలఫలకం పెచ్చులూడిపోయి అధ్వానంగా తయారైంది. ఇది వరకు శిలాఫలకానికి చుట్టూ ఏర్పాటు చేసిన రక్షణ కంచే అగ్నికి ఆహుతి అయింది. యూనివర్సిటీ స్వాగత తోరణం వద్ద ఏర్పాటు చేయాల్సిన శిలాఫలకం అధికారుల పర్యవేక్షణ లోపంతో అమాత్యుల పేర్లు ఊడిపోయి కళవిహీనంగా మారింది. ప్రభుత్వ పాలకులు పునరుద్దరించి వర్సిటీ స్వాగత తోరణం వద్ద ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు



మోస్రాలో మాట్లాడుతున్న ఆర్మూర్ ఆర్‌డీవో



పాల్గొన్న పూర్వవిద్యార్థులు



హసకొత్తూర్‌లో ..

ఆత్మీయ సమ్మేళనాలు

మోస్రా, జూన్16: మండల కేంద్రంలోని మోటాడి రెడ్డి కల్యాణ మండపంలో జిల్లా పరిషత్ మోస్రా 1990-91 పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు తమకు విద్య నేర్పిన గురువులను ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా విద్యార్థి దశలో చేసిన చిలిపి అల్లరి, ఆనాటి ఆట, పాటలు గుర్తుకు చేసుకొని ఆనందించారు. ప్రతి విద్యార్థి తన కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు చేస్తున్న వృత్తి ఉద్యోగం చెప్పుకుంటూ తమ కుటుంబ సభ్యులను మిత్రుల అందరికి పరిచయం చేశారు. తమ విద్యార్థులు చేస్తున్న ఉద్యోగం పలువురి బిజినెస్‌లపై వారిని అభినందించారు.

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండలం హసాకొత్తూర్ ఉన్నత పాఠశాలకు చెందిన 2004-05 విద్యాసంవత్సర పదవతరగతి చదివిన పూర్వ విద్యార్థులు 20 సంవత్సరాల తరువాత ఒక చోట కలుసుకుని గెట్టుగెదరు కార్యక్రమాన్ని ఘనంగ జరుపుకున్నారు. ఈ సందర్భంగ వివిధ ప్రాంతాలలో వివిధ వృతులు, వ్యాపారాలు, ఉద్యోగులు స్థిరపడిన పూర్వ విద్యార్థులు, విద్యార్థినిలు మంగళవారం హసాకొత్తూర్ చేరుకున్నారు 20 ఏళ్ల తరువాత ఒక చోట కలుసుకున్నవీరు ఒకరినొకరు ఆప్యాయంగ పలుకరించుకుంటు యోగక్షేమాలు, ప్రస్తుత వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాతజ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్దలు నేర్పిన ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువలు, జ్ఞాపికలతో సన్మానించుకుని వారి ఆశీర్వాదాలు అందుకున్నారు. అంతకు ముందు తాము చదివిన పాఠశాలకు వెళ్లి తరగతగదిలో కూర్చొని గతస్మృతులను గుర్తు చేసుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేసి రోజంత అనందడోలికల్లో మునిగి తేలారు. పూర్వ విద్యార్థు అపూర్వ సమ్మేళనంలో అప్పటి ప్రధానోపాధ్యాయులు సాంబశివరావు, ఉపాధ్యాయులు గంగాధర్, రంగాచారి, శ్రీనివాస మూర్తి, పూర్వవిద్యార్థినిలు విద్యార్థులు పాల్గొన్నారు. బోధన్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

బోధన్‌రూరల్: బోధన్ పట్టణంలోని బీటీ నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి వరకు కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా ఒకరినొకరు కలుసుకుని తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తమకు చదువు చెప్పిన గురువులను సన్మానించారు. 1986-87కు చెందిన పదవ తరగతి విద్యార్థుల బ్యాచ్ ఒకరునొకరు పలకరించుకుంటూ ఆనాటి చిన్ననాటి గుర్తులను నెమరు వేసుకున్నారు. తమ గురువులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పురాణే అజయ్ కుమార్, ఉమాకాంత్, శివాజీ, కర్నె శ్రీనివాస్‌లతో తదితరులు పాల్గొన్నారు.

డొంకేశ్వర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2013-14లో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంత ఒక చోట చేరి గత అనుభవాలు నెమరు వేసుకున్నారు. అనంతరం అనాటి గురువులను పూర్వవిద్యార్థులు సన్మానించారు.

ఆర్మూర్‌రూరల్: ఆర్మూర్ మండలం ఫత్తేపూర్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2000-01విద్యాసంవత్సరం పదవ తరగతి విద్యార్థులు ఆదివారం పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 23ఏళ్ళ తర్వాత కలుసుకున్న వారు అనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు గడ్డం అవినాష్, భూపతిరెడ్డి, గంగాధర్, విద్యాసాగర్, రవి, రాజేందర్, నందన, సుజాత, రాగిని, మంజుల పాల్గొన్నారు. ఆర్మూర్ మున్సిపల పరిధి మామిడిపల్లి శివారులోని మైత్రి గార్డెన్‌లో ఆగివారం గోవింద్‌పేట్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1996-97 విద్య సంవత్సరం పదవ తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. గురువు లు రాంరెడ్డి, నీరజ్, రాజేశ్వర్‌రెడ్డి, నారాయణరెడ్డిలను ఘనంగా సన్మానించారు.



ఫత్తేపూర్‌లో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న గురువులతో పూర్వవిద్యార్థులు



గోవింద్‌పేట్‌లో ..

విద్యుత్ ప్రజావాణి కార్యక్రమాన్ని వినియోగించుకోవాలి

ఇందల్వాయి, జూన్ 16: ఇందల్వాయి మండలంలోని ఎల్లారెడ్డిపల్లి, గన్నారం, ఇందల్వాయి, నల్లవెల్లి సబ్‌స్టేషన్ల పరిధిలో ఈనెల 17 నుంచి విద్యుత్ ప్రజావాణి కార్యక్రమం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించబడుతున్నందున ఆయా గ్రామాల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు ఏవైనా సమస్యలు ఉంటే ప్రజావాణి కార్యక్రమంలో నమోదు చేసుకొని సమస్యలు పరిష్కరించుకోవాలని అడిషనల్ అసిస్టెంట్ ఇంజనీర్ జ్ఞానేశ్, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ శ్రీనివాస్‌లు తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కోటగిరి: విద్యుత్ సమస్యలపై ప్రతి సోమవారం తలపెట్టిన ప్రజావాణి కార్యక్రమాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోటగిరి ట్రాన్స్‌కో ఏఈ నాయిని కృష్ణ తెలిపారు. కోటగిరి సబ్ స్టేషన్‌లో సోమవారం 10నుండి 1గంట వరకు ప్రజావాణి కొనసాగుతుందని ఆయన తెలిపారు. మధ్యాహ్నం 3గంటల నుండి సాయంత్రం 5గంటలకు సర్కిల్ కార్యాలయంలో విద్యుత్ ప్రజావాణి ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నందిపేట: మండల కేంద్రంలోని 33/11కెవి విద్యుత్ సబ్ స్టేషన్, ఈఆర్‌వో ఆఫీస్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నందిపేట ట్రాన్స్‌కో ఏడీఈ ఎం అశోక్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి, మధ్యాహ్నం 1గంట వరకు ఉంటుందని, విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏడీఈ కోరారు. వినియోగదాలు ఏవైనా సమస్యలు ఉంటే ప్రజావా ణిలో విన్నవించుకోవాలని, సమస్యకు సత్వరమే పరిష్కారం దొరు కుందని తెలిపారు. ప్రజావాణి ప్రతీ సోమవారం నిర్వ హించబ డుతుందని నందిపేట ట్రాన్స్‌కో ఏడీఈ ఎం అశోక్ పేర్కోన్నారు.

డిచ్‌పల్లి: విద్యుత్ శాఖ సబ్‌డివిజన్, ఈఆర్‌వో, డివిజన్ కార్యాలయాలల్లో ప్రజావాణి కార్యక్రమాన్నినిర్వహిస్తున్నట్లు డీఈ ఉత్తమ్ జాడే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం బక్రీద్ సందర్భంగా సెలవు ఉన్న ప్రజావాణి కార్యక్రమం మాత్రం కొనసాగుతుందని అన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని ప్రకటనలో వివరించారు.

మున్సిపల్ కార్మికులకు కనీసవేతనం అందేలా చూడాలి



చైర్‌పర్సన్‌కు వినతి పత్రం అందిస్తున్న మున్సిపల్‌యూనియన్‌నాయకులు

కామారెడ్డిటౌన్,జూన్ 16: మున్సిపల్ కార్మికులకు కనీసవేతనం రూ.26 వేలు అందేలా చూడాలని మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాజనర్సు అన్నారు. ఆదివారం మున్సిపల్‌చైర్‌పర్సన్ ఇందుప్రియకు వినతి పత్రం అందించారు.ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ రెండో పీఆర్‌సీ ప్రకారం వేతనాలు పెంచాలని ఆలోపు పక్క రాష్ట్రంలో ఇస్తున్నట్లుగా రూ.21 వేలను అమలుచేయాలని,సీఎం రేవంత్‌రెడ్డి అమలుచేసిన రూ.1000ని అమలుచేయాలని, స్థానికంగాఉన్న సమస్యలను పెండింగ్ లో ఉన్న పీఎఫ్ డబ్బులను, శానిటేషన్ చేస్తున్న 100మంది కార్మికులకుపెండింగ్ జీతా లు ఇవ్వాలని, జీవోనంబర్ 4 ప్రకారం అందరితో పాటు రూ.16,600 ఇవ్వాలని, రెండు జతల బట్టలు సబ్బులు,నూనెలు, చెప్పులు పనిముట్లు అందించాలని కోరమన్నారు. అలాగే ఈనెల 26న కలెక్టరేట్ వద్ద ధర్నా,జూలై మొదటి వారంలో సీడీఎంఏ ఆఫీస్ ముట్టడి చేపడుతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్, దీపక్‌ప్రభు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై ప్రతీ సోమవారం ప్రజావాణి

లింగంపేట, జూన్ 16 : విద్యుత్ వినియోగదారుల సమస్యలను వెంట వెంటనే పరిష్కరించాలనే లక్ష్యంతో ప్రతీ సోమవారం విద్యుత్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీఈఈ గణేశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రతీ మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ప్రతీ సోమవారం ప్రజా వాణిలో లిఖిత పూర్వకంగా పిర్యాదు చేయాలని ఆయన పేర్కొన్నారు. విద్యుత్ ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రతీ సోమవారం నిర్వహించాలని టీజీ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ ఆదేశాలు జారి చేశారని ఈ ఆవకాశాన్ని వినియోగదాలురు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

లింకుపై క్లిక్ చేయగా రూ.23 వేల డబ్బులు మాయం

ఎల్లారెడ్డి, జూన్ 16: లింకుపై క్లిక్ చేయగా రూ.23 వేలు అకౌంట్ నుంచి కట్ అయిన సంఘటన ఎల్లారెడ్డి మండలంలోని అడవి లింగాల గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన సంగమేశ్వర్‌రెడ్డి అనే ప్రభుత్వ ఉద్యోగికి గత 23వ తేదీన ఆయన మొబైల్‌కు గుర్తు తెలియని నెంబర్ నుంచి యూనియన్ బ్యాంకు ఏపీకే ఫైల్ అనే లింకు రాగా లింకుపై నొక్కడంతో ఆయన అకౌంట్ నుంచి రూ.23 వేలు కట్ అయినట్లు మెసేజ్ రావడంతో ఎల్లారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితుడు తక్షణమే 1930 సైబర్ క్రైమ్ నెంబర్‌కి డయల్ చేయగా మొత్తం 23 వేలు రికవరీ అయినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి ఎస్‌ఐ మహేష్ మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తులు ఓటీపీలు గాని లింకులు గాని పంపితే వాటికి సమాధానం ఇవ్వకూడదని తెలిపారు.

గోవధపై నిఘా ఏర్పాటు చేయాలి



వినతి పత్రం అందిస్తున్న బీబీపేట మండల ధర్మజాగరణ సమితి నాయకులు

బీబీపేట, జూన్ 16:గోవధపై ప్రత్యేక నిఘా ఏర్పాటుచేయాలని బీబీపేట మండల ధర్మజాగరణ సమితి నాయకులు స్థానిక పోలీసుస్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ సాయిబాబాకు వినతి పత్రం అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో బీబీపేట పరిసర ప్రాంతాలలో గోవధ జరిగిన సందర్భాలు ఉన్నాయని దానిని దృష్టిలో పెట్టుకుని బక్రీద్ సందర్భంగా గోవధ జరగకుండా గట్టినిఘా ఏర్పాటుచేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు నరేందర్, శ్రీనివాస్, సంతోష్‌గౌడ్, మల్లేషం,సాయికుమార్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీ అందిస్తున్న ప్రభుత్వవిప్ షబ్బీర్‌అలీ

కామారెడ్డిటౌన్, జూన్ 16:కామారెడ్డి పట్టణానికిచెందిన మహ్మద్ జహంగీర్‌పాషా భార్య సమీరాభేగం అనారోగ్యంతో బాదపడుతూ నిమ్స్ ఆసుపత్రిలో చేరగా ఆమె ఆపరేషన్ నిమిత్తం ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ రూ.1,60,000 ఎల్‌ఓసీని అందించారు.అలాగే పట్టణానికిచెందిన రాజేందర్ భార్య అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్ ఆసుపత్రిలో చేరగా ఆమెకు రూ.1,10,000ల ఎల్‌ఓసి అందించారు.ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, మున్సిపల్‌ఛైర్‌పర్సన్ ఇందుప్రియ,వైస్ ఎంపీపీ నరేష్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ఎల్లారెడ్డి, జూన్ 16: చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన సంఘటన ఎల్లారెడ్డి మండలంలోని దావల్ మల్కపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎల్లారెడ్డి ఎస్‌ఐ మహేష్ తెలిపిన వివరాల ప్రకారం దావల్ మల్కాపల్లి గ్రామానికి చెందిన సిద్దవ్వ (48) అనారోగ్య సమస్యతో గత కొన్ని రోజుల నుంచి కాలు నొప్పి అధికమవడంతో సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఎలుకల మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు సిద్దవ్వను ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఆదివారం ఉదయం చికిత్స పొందుతూ మృతి చెందగా మృతురాలు భర్త కిష్టయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అద్దె భవనాల్లో అధికారుల ఇక్కట్లు

- గుత్తేదారుల నిర్లక్ష్యం
- ఎన్నికల ముందు హుటాహుటిన ప్రారంభించిన మాజీ శాసనసభాపతి
- మండల అధికారులకు తప్పని తిప్పలు



నసురుల్లాబాద్‌లో నిరుపయోగంగా ఉన్న సమీకృత భవనం

నసురుల్లాబాద్, జూన్ 16: మండల కేంద్రంలో కోటి రూపాయలతో నిర్మించిన సమీకృత భవనం పూర్తికాకపోవడంతో అధికారులు అద్దె భవనాల్లోనే విధులు నిర్వహిస్తున్నారు. దీంతో శాశ్వత భవనం లేక అధికారులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత కార్యాలయాలు ఎక్కడున్నాయో తెలియక ప్రజలు సైతం మండల కేంద్రం మొత్తం తిరగాల్సి వస్తుంది. మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘంలో తహసీల్దార్ కార్యాలయం, ఉర్దూ మీడియంలో ఎంఈవో ఆఫీస్, అద్దె భవనంలో ఐకేపీ కార్యాలయం, నూతనంగా నిర్మించిన ఎంఈవో కార్యాలయంలో మండల అభివృద్ధి కార్యాలయాలలో మండల అధికారులు విధులు నిర్వహిస్తున్నారు.కాగా అసెంబ్లీ ఎన్నికలు షెడ్యూల్ ప్రారంభమవుతున్న చివరి రోజున గత శాసనసభ స్పీకర్, ప్రస్తుత ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి హుటాహుటిన భవనాన్ని ప్రారంభించి కేవలం అతి త్వరలో ఈ భవనం పూర్తి చేయాలని గుత్తేదారులకు ఆదేశించారు.కాని ఆయన మాటలను గుత్తేదారులు పెడచెవిన పెట్టి భవ నిర్మాణాన్ని ఆలస్యం చేశారు. దీంతో ఎన్నికల్లో ఫలితాలు తారుమారు కావడంతో ప్రభుత్వం మారిపోయింది.గుత్తేదారుల నిర్లక్ష్యం కారణంగా అధికారులు ఇబ్బంది పడాల్సి వస్తుంది. ఇప్పటికైనా సంబంధితశాఖ అధికారులు స్పందించి నూతనంగా ఏర్పాటు చేసిన సమీ కృత భవనంలో అధికారులు విధులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని మండల ప్రజలు, అధికారులు కోరుతున్నారు.

దుక్కులు దున్ని దిక్కులు చూస్తున్న అన్నదాతలు



సాగుకు భూమి సిద్ధం చేసిన రైతులు

మద్నూర్, జూన్ 16: ఖరీఫ్‌లో పంటలు వేయడానికి భూములు దుక్కి దున్ని రైతులు సిద్ధం చేసి పెట్టారు. ఇంత వరకు వరుణుడు కరుణించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్ సీజన్ మొదలై పక్షం రోజులైన ఉమ్మడి మద్నూర్ మండలంలో కనీస వర్షపాతం నమోదు కాకపోవడంతో, ఇక్కడి రైతులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది ఈ సమయానికి పంటలు సాగు చేశామని ఈ సంవత్సరం ఆలస్యంగా వర్షాలు కురుస్తాయని కోటి ఆశలతో రైతులు దుక్కులు దున్ని పంటలు వేసేందుకు సిద్ధమవుతుండగా నేటి వరకు చెప్పుకోదగ్గర వర్షం పడకపోవడంతో రైతులు దుక్కులతోనే ఆగిపోవాల్సి వచ్చింది. ఎంతో మంది రైతులు ఆలస్యంగానైనా వర్షాలు కురవక పోతాయా అన్న ఆశతో ఎరువులు, విత్తనాలు తెచ్చి సిద్ధం చేసుకు న్నారు. ఈ ప్రాంతంలో ఎటువంటి నీటి వనరులు లేకపోవడంతో రైతులు వర్షాధారం పైనే ఆధారపడి పంటలు పండిస్తారు. అటువంటిది ఇంత వరకు వర్షం కురవకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఉమ్మడి మద్నూర్ మండలంలో సుమారు 50 వేల ఎకరాల భూమి సాగులో ఉంటుంది. ఈ ప్రాంతంలో అధికంగా సోయా, పత్తి, పెసర, కంది పంటలు పండిస్తుంటారు. అటువంటిది ఇంత వరకు వర్షాలు కురవకపోవడంతో రైతులు వరుణుడి కరుణ కోసం ఎదురు చూస్తు న్నారు. ఈసారి వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటల విస్తీర్ణం తగ్గవచ్చునని రైతులు అభిప్రాయపడుతున్నారు. రాష్ట్రానికి నైరుతి రుతుపవనాలు గత నెల చివరి వారంలోనే వచ్చినప్పటికీ ఉమ్మడి మద్నూర్ మండలాల్లో ఇప్పటి వరకు వర్షాలు రాకపోగా రైతులు నిరాశ చెందుతున్నారు.

శబరిమలై వచ్చే భక్తులకు కనీస వసతుల కల్పన

మద్నూర్, జూన్ 16:మండల పూజ, మకర విలక్కు సమయాల్లో శబరిమలైను దర్శించే భక్తులకు ట్రావెన్ కోర్ దేవస్థానం బోర్డు శుభ వార్త చెప్పినట్లు ఉమ్మడి మద్నూర్ మండల అయ్యప్ప సేవా సమితి సభ్యులు వెల్లడించారు. శబరి మలైకు వచ్చ భక్తులకు కనీస వసతుల కల్పన, భద్రత కోరుతూ ప్రచార సమితి తరపున గత ఏడాది కేరళ సీఎం పినరై విజయన్‌కు ఇచ్చిన వినతిపత్రంపై ట్రావెన్ కోర్ దేవ స్థానం బోర్డు సానుకూలంగా స్పందించి కార్యాచరణ ప్రారంభించిందని తెలిపారు. శబరిమలైకి వచ్చే భక్తులకు మౌలిక వసతులు లేక నానా ఆగచాట్లు పడుతుండటం, ప్రమాదాల బారిన పడటం వంటి సంఘటనల నేపథ్యంలో ఇబ్బందులను పరిష్కరించేందుకు ప్రచార సమితి ఇచ్చిన వినతిపై ట్రావెన్ కోర్ దేవస్థానం బోర్డు ప్రత్యేక దృష్టాసారిం చినట్లు తెలిపారు. ఇందులో భాగంగానే గతంలో స్వామి దర్శనం కోసం అన్‌లైన్ బుకింగ్ సదుపాయం కేవలం పది రోజుల ముందు నుంచి మాత్రమే ఉండేదని కాని ఇప్పుడు మూడు నెలల ముందుగానే వర్చువల్ క్యూ బుకింగ్ చేసుకుని అవకాశాన్ని బోర్డు కల్పించినట్లు తెలిపారు. అదే విధంగా భక్తుల ఆరోగ్య భద్రత కోసం ఇన్సురెన్స్ పాలసీని అందించనున్నట్లు ప్రకటించిందని అన్నారు. భక్తులు దర్శనం టికెట్ బుకింగ్ చేసుకునే సమయంలోనే వారి నుంచి అదనంగా రూ.10 వేలు వసూలు చేసి భీమా పాలసీని వర్తింపజేస్తారని తెలిపారు.

ఘనంగా పోచమ్మలకు బోనాలు




కోనాపూర్‌లో ముత్యాల పోచమ్మకు బోనాలు సమర్పిస్తున్న దృశ్యం

బాన్సువాడ, జూన్ 16: బాన్సువాడ మండలం కోనాపూర్ గ్రామంలో ఆదివారం ముత్యాల పోచమ్మ తల్లికి బోనాల పండుగను ఘనంగా మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. అలంకరించిన బోనాల ను ఆడపడుచులు ఎత్తుకుని గ్రామంలోని ప్రధానవీధుల గుండాల ముత్యా ల పోచమ్మ గుడికి చేరుకుని బోనాలు సమర్పించారు. పిల్లలు, పెద్దలు సల్లంగా ఉండాలని పాడి పంటలు బాగా పండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్. పరమేష్, రాజన్న, సంజీవ్, భాశెట్టి అనిల్, భాస్కర్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట: మండలంలోని పోచారం గ్రామంలో బోనాల పం డుగను గ్రామస్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. బోనాల పం డుగ సందర్భంగా గ్రామం నుంచి గ్రామ శివారులో గల దుర్గమ్మ, పోచమ్మ ఆల యాల వరకు మహిళలు పెద్ద ఎత్తున బోనాలను ఎత్తుకుని ఊరే గింపుగా ఆలయాలకు వెళ్లి అమ్మవార్లకు బోనాలను సమర్పించారు. ఆల యాలలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్య క్రమంలో ఎంపీపీ వినీత, గ్రామ మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సిద్ధరామేశ్వర ఆలయంలో భక్తుల తాకిడి



సిద్దరామేశ్వర ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

భిక్కనూరు, జూన్ 16: మండలకేంద్రంలోని దక్షిణకాశీగా బాసిల్లుతున్న శ్రీసిద్ధరామేశ్వర ఆలయంలో భక్తుల తాకిడి నెలకొంది. ఆదివారం ఉదయం నుండే భక్తులు జిల్లా నలుమూలల నుండే కాకుండా మెదక్, సిద్దిపేట, కరీంనగర్, హైదారాబాద్ నుంచి పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈమేరకు స్వామివారిని ఆలయ అర్చకులు అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ చేశారు.

కంచర్ల యాదవ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

భిక్కనూరు,జూన్ 16:మండలంలోని కంచర్ల గ్రామ యాదవ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా గొల్ల మహేందర్ యాదవ్, ఉపాధ్యక్షుడిగా గొల్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా తిరుపతి యాదవ్, శ్రీశైలం యాదవ్, రవియాదవ్, సలహాదారులుగా కిషన్‌యాదవ్ ఎన్నికయ్యారు. ఈ మేరకు నూతన కార్యవర్గం సభ్యులు మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి పూర్తి సమయాన్ని కేటాయిస్తామని, తమను ఎన్నుకున్న సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం



రజిత(ఫైల్)

ఎల్లారెడ్డి,జూన్ 16: మండలంలోని కళ్యాణి గ్రా మానికి చెం దిన గులపల్లి రజిత (19) అనే యువతి అదృశ్యమైనట్లు ఎల్లారెడ్డి ఎస్‌ఐ మహేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కల్యాణి గ్రామానికి చెం దిన గులపల్లి కిషన్ ఆయన భార్య ఉదయం కూలీ పనికి వెళ్లి తిరిగి మధ్యాహ్నం 12 గంటలకు ఇంటికి వచ్చి చూడగా అతని కూతురు రజిత కనిపించకపోవడంతో చుట్టు పక్కల తెలిసిన వారి వద్ద వెతకగా ఆచూకి లభించక పోవడంతో యువతి తండ్రి కిషన్ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

తాడ్వాయి,జూన్ 16:తాడ్వాయి మండలం చందాపూర్ గ్రామంలో రెండురోజుల క్రితం మృతిచెందిన ఆవుల రాజేందర్ కుటుంబానికి పూర్వ విద్యార్థులు రూ.50వేలను అందించారు. రాజేందర్ ఫిట్స్‌తో మృతిచెందగా ఆయన భార్య సైతం గతంలో మృతి చెందింది.దీంతో ఇద్దరు కుమారులు అనాథలుగామారారు.దీంతో వారిని పూర్వవిద్యార్థులు ఆర్థికసహాయం చేశారు.ఈ కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, శిరిష్‌రెడ్డి, నగేష్, బాలయ్య, రాజశేఖర్, రవీందర్‌రెడ్డి, రాములు,మోహన్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసహాయం చేస్తున్న పూర్వవిద్యార్థులు

హైదరాబాద్‌లో ఫిషరీస్ చైర్మన్‌ను కలిసిన గంగపుత్ర సంఘ సభ్యులు



ఫిషరీస్ చైర్మన్‌ను కలిసి బీర్కూర్ గంగపుత్ర సంఘ సభ్యులు

నసురుల్లాబాద్,జూన్16:బీర్కూర్ గంగపుత్ర సంఘ సభ్యులు ఆది వారం గాంధీ భవన్‌లో తెలం గాణ రాష్ట్ర పిషరీస్ ఛైర్మన్ శ్రీమెట్టు సాయి కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం గంగపుత్ర సం ఘ నాయకులతో కలిసి ఛైర్మన్‌ను పూలమాల, శాలువాతో సత్కరించారు. గంగపుత్రుల సమస్యలను ఆయనకు తెలియజేశారు.ఈసందర్భంగా గంగపుత్ర సంఘ సభ్యులు మాట్లాడుతూ గంగపుత్రులకు ప్రభుత్వం ద్వారా వచ్చే సంక్షేమ పథకాలను అమలు చేయాలని ఛైర్మన్‌ను కోరడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ మాజీ అధ్య క్షుడు దొబ్బల గంగా ధర్, జిల్లా మత్స్య శాఖ డైరెక్టర్ ఎర్ర సాయిలు, నర్ర సాయిలు, పి.సాయిలు, గుల పోశెట్టి, తది తరులు పాల్గొన్నారు.

బీర్కూర్: మండలానికి చెందిన గంగపుత్ర సంఘం నాయకులు ఆది వారం హైదరాబాద్‌కు తరలివెళ్లారు.గాంధీ భవన్‌లో రాష్ట్ర పిషరీస్ ఛైర్మన్ మెట్టు సాయికు మార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఛైర్మన్‌కు శాలువాను కప్పి ఘనంగా సన్మానించారు. గంగపుత్రులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయనతో చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్య శాఖ మాజీ అధ్యక్షుడు దొబ్బల గంగాధర్, జిల్లా మత్స్య శాఖ డైరెక్టర్ తదితరులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలను తొలగించండి సారూ...!



వ్యవసాయ భూమిలో వేసిన విద్యుత్ స్తంభాలు

మద్నూర్,జూన్16:మండలంలోని పెద్దఎక్లారా గ్రామంలో రైతులు పంట పండించే వ్యవసాయ భూమిలో విద్యుత్ స్తంభాలు వేయడం వల్ల నష్టపోతున్నామని పలువురురైతులు జిల్లా విద్యుత్ అధికారికి వినతిపత్రం సమర్పించారు.మాపంట భూమిలో వేసిన విద్యుత్ స్తంభాలను తొలగించాలని పేర్కొన్నారు.గ్రామ సమీపంలో నూతనంగా విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం చేపట్టారు. అక్కడి నుంచి పెద్ద ఎక్లారా గ్రామానికి విద్యుత్‌లైన్ వేస్తుండగా వాటిలో విద్యుత్ స్తంభాలు రైతులకు సంబంధించిన భూముల్లో వేయడం వల్ల పంట నష్టపోతామని, రైతులు జిల్లావిద్యుత్ అధికారికి ఫిర్యాదు చేశారు. రైతులకు సంబంధించిన వ్యవసాయ భూమిలో కాకుండా రైతు లకు సంబం ధించిన వ్యవసాయ భూమి పక్కనే ఒడ్డు ఉన్నందున ఒడ్డు పక్క నుంచి విద్యుత్ స్తంభాలు వేయాలని రైతులు కోరుతున్నట్లు వినతిపత్రం పేర్కొన్నారు.

భక్తుల కొంగు బంగారం కొచ్చెరి మైసమ్మ



కొచ్చెరి మైసమ్మదేవి

నసురుల్లాబాద్,జూన్ 16: మండలం మైలారం గ్రామ శివారులో గల కొచ్చెరి మైసమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చుట్టు పక్కల గ్రామాల ప్రజలు కాకుండా వివిధ మండలాల భక్తులు వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కు లు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం కొచ్చేరి మైసమ్మ తల్లి అని అన్నారు. అనంతరం భక్త లు కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ ప్రాంగణంలో సహా పంక్తి భోజనాలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు.

బాధితుడికి మొబైల్ ఫోన్ అప్పగింత



బాధితురాలి బంధువుకు ఫోన్ అప్పగిస్తున్న కానిస్టేబుల్

బీర్కూర్, జూన్ 16 : బీర్కూర్ మండల కేంద్రానికి చెందిన కంతం స్వప్న అనే మహిళ సెల్ ఫోన్ నెల రోజుల క్రితం చోరికి గురైంది. ఈ మేరకు ఆమె బీర్కూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్ ట్రేస్ చేసి రికవరీ చేశారు. ఆదివారం స్వప్న బంధువుకు ఫోన్‌కు అప్పగించారు.

బక్రీద్‌ను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలి



మిర్జాపూర్‌లో శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న పోలీసులు

నసురుల్లాబాద్, జూన్ 16: మండలంలోని ఆయా గ్రా మాలకు చెందిన మండల ప్రజలు బక్రీద్ పండుగను శాంతియుత వాతా వరణంలో జరుపుకోవాలని ఎస్‌ఐ లావణ్య సూచించారు. ఆదివారం మండ లంలోని మిర్జాపూర్, దుర్కి గ్రామాలలోని యువకులు, గ్రామ ప్రజలతో శాం తి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బక్రీద్ పండుగను మైనారిటీ సోదరులు, హిందువులు సోదర భావంతో జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, ఆయా గ్రామాల ప్రజలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిపథ్ ఉద్యోగానికి ఎంపికైన అర్చరీ క్రీడాకారులు



అగ్నిపథ్ ఉద్యోగానికి ఎంపికైన వారిని సన్మానిస్తున్న దృశ్యం

దోమకొండ, జూన్ 16:మండల కేంద్రానికి చెందిన అర్చరీ క్రీడాకారులు ఏ. అభిరామ్, ఎన్. నవీన్ కుమార్ అగ్నిపథ్ సైనిక ఉద్యోగానికి ఎంపిక కావడం పట్ల జిల్లా అర్చరీ అధ్యక్షుడు జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, సంఘం కార్యదర్శి కదిరె మోహన్‌రెడ్డి, కోచ్ ప్రతాప్‌దాస్‌లు వారిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో అర్చరీ క్రీడాకారులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి పల్లిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రాజంపేట, జూన్ 16:రాజంపేట మండలంలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ధరణిమల్లేష్(29) చికిత్స పొందుతూ మృతిచెందాడని ఎస్‌ఐ సంపత్ తెలిపారు. ఈనెల 13న పురుగులమందు తాగి కొద్దిసేపటికి కుటుంబ సభ్యులతో తాగిన విషయాన్ని చెప్పడంతో కుటుంబీకులు వెంటనే కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడినుంచి మెరుగైన చికిత్స కోసం ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అక్కడి చికిత్సపొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుని భార్య ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.మృతునికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి		బాన్సువాడ	
దర్శన్	మహారాజ	మహేశ్వరి	ఇంద్రాణి
శాంతి	ఓసీ	వెంకటేశ్వర	మహారాజ
ప్రియ 70	మనమే		
ప్రియ 35	హరోంహర		

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	160	200	220
వెన్‌కాబ్(కిలో)	170	220	240

